




RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 52


పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 22 జూలై 2026


## ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు నాంది

● ఏపీ ఈడీబీతో యూఏఈ అవగాహనా ఒప్పందం ● ఫుడ్ ప్రాసెసింగ్ లో యూఏఈ పెట్టుబడులకు మార్గం సుగమం ● వాణిజ్యం, ఎగుమతులు, పెట్టుబడులకు యూఏఈ క్లస్టర్ సహకారం ● తొలి పెట్టుబడిగా చిత్తూరులో యూఏఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ● రూ.100 కోట్లతో పెట్టుబడితో ముందుకు వచ్చిన ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ ● సీఎం చంద్రబాబు, యూఏఈ మంత్రి అబ్దుల్లాబిన్ తౌక్ అల్ మర్రీ సమక్షంలో ఎంఓయూ





**అమరావతి,కలంకౌంటర్ :** ఈ ఏడాది దావోస్ లోని ప్రపంచ ఆర్థిక సదస్సులో కుదుర్చుకున్న మరో ఒప్పందం ఇవాళ సాకారమైంది. యూఏఈ ఫుడ్ క్లస్టర్ ద్వారా ఏపీలోని ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎగుమతులు, వాణిజ్యం, పెట్టుబడులను పెట్టేలా ఏపీ ఈడీబీ–యూఏఈకి చెందిన ఫుడ్ క్లస్టర్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈమేరకు రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు, యూఏఈ ఆర్థిక, పర్యాటక విభాగం మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ద్వారా పెద్ద ఎత్తున ఉద్యాన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతులు, విదేశీ వాణిజ్యం సహా యూఏఈకి చెందిన సంస్థలు పెట్టుబడులు పెట్టేలా ఈ ఒప్పందం కుదిరింది. ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుపై ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబుతో యూఏఈ ప్రతినిధుల బృందం చర్చలు జరిపింది. ఈ ఏడాది జనవరిలో దావోస్ పర్యటనలో ఏపీలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించి యూఏఈ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆహారశుద్ధి రంగంలో ఏపీలో వ్యాల్యూ చైన్ ఏర్పాటు చేయాలని యూఏఈ నిర్ణయించింది. ఇందుకోసం ఏపీ ప్రభుత్వం– యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటు చేస్తూ ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. మామిడి, అరటి, కోకో లాంటి వివిధ ఉద్యాన ఉత్పత్తులకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, విలువ జోడించిన ఉత్పత్తుల ఎగుమతులు, వాణిజ్యం లాంటి అంశాల్లో ఈ ఎంఓయూ సహకరించనుంది. ఈ ఒప్పందంలో తొలి అడుగుగా యూఏఈకి చెందిన ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఏపీలోని చిత్తూరులో రూ.100 కోట్లను పెట్టుబడిగా పెట్టేందుకు ముందుకు వచ్చింది. చిత్తూరు జిల్లా, గంగాధర నెల్లూరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్న ఈ సంస్థ ప్రపంచ శ్రేణి ఉత్పత్తులను తయారు చేయనుంది. దుబాయ్, యూఏఈ కేంద్రంగా పనిచేస్తున్న ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ సంస్థ దాదాపు 25 దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఏపీలో ఏర్పాటు చేయనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నుంచి కూడా అంతర్జాతీయ మార్కెట్లకు ఉత్పత్తులను ఎగుమతి చేయనుంది.

**క్వాంటం స్పీడ్ తో అవకాశాలు అందుకోండి..** దావోస్ లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనపరిచిన యూఏఈ ఆరు నెలల్లోగా వాటిని సాకారం చేసే దిశగా ముందుకు వచ్చిందని సీఎం చంద్రబాబు అన్నారు. యూఏఈ ఫుడ్ క్లస్టర్ ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎగుమతులు, వాణిజ్యం, పెట్టుబడులకు ఏపీ వేదిక కావటం సంతోషదాయకమని సీఎం వ్యాఖ్యానించారు. ఉద్యాన, ఆక్వా, ఐటీ రంగాల్లో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలోని వైవిధ్యమైన వాతావరణ పరిస్థితుల కారణంగా ఏడాది పొడవునా వివిధ రకాల ఉద్యాన ఉత్పత్తులు సాగు చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. రాష్ట్ర స్థూల ఆదాయంలో 30 శాతం మేర ఉద్యాన, వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా వస్తోందని చెప్పారు. రూ. 1 లక్ష కోట్ల ప్రభుత్వం, ప్రైవేటు పెట్టుబడితో రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మారుస్తున్నామని తెలిపారు. రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్–xూలాను కూడా ఏర్పాటు చేయనున్నట్టు సీఎం వివరించారు. 200కు పైగా ఉద్యాన క్లస్టర్లతో అక్వా మిర్చి, పామాయిల్, కోకో, కాఫీ తదితర పంటల్లో ఏపీ ఎగుమతులు చేస్తోందని సీఎం యూఏఈ ప్రతినిధి బృందానికి వివరించారు. కృష్ణా–గోదావరి డెల్టాలో నిరంతర నీటి సరఫరా కారణంగా వ్యవసాయ ఉత్పత్తి సాధించగలుగుతున్నామని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపీకి ఓ విధానంగా మారిపోయిందని తెలిపారు. ప్రగతిశీల విధానాల వల్ల దేశంలోని పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయన్నారు. పోర్టులు, రైల్వే, రోడ్డు వ్యవస్థతో ఏపీ లాజిస్టిక్స్ కేంద్రంగా మారిందని అన్నారు. ఆగస్టు 1 తేదీ నుంచి ఏపీలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం ఏపీలో అందుబాటులోకి వస్తోందని వివరించారు. విస్తృతమైన వనరులతో వివిధ రంగాల్లో విస్తృత వ్యాపార అవకాశాలను అందించేందుకు ఏపీ సిద్దంగా ఉందని ముఖ్యమంత్రి యూఏఈ బృందానికి తెలిపారు.

## ఉపరాష్ట్రపతితో కేంద్ర, రాష్ట్ర మంత్రుల భేటీ



**న్యూఢిల్లీ,కలంకౌంటర్ :** ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్న పథకాలు, వ్యవసాయ రంగంలో తీసుకుంటున్న కీలక నిర్ణయాలు, రైతులకు అందుతున్న ప్రభుత్వ సహకారం తదితర అంశాలను ఉపరాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రగతి, రైతుల అభ్యున్నతి, ప్రజా సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు సాగుతున్న తీరుపై ఈ సందర్భంగా చర్చ జరిగింది.

## ముడి పొగాకుపై జీఎస్టీ 40 శాతం నుంచి 28 శాతానికి తగ్గించాలి

- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర మంత్రులు, ఎంపీల వినతి



**న్యూఢిల్లీ,కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, సహచర మంత్రులు, ఎంపీలతో కలసి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ని పార్లమెంట్ లో కలిసి ముడి పొగాకు (సూచీ 2401)పై ప్రస్తుతం అమలులో ఉన్న 40 శాతం జీఎస్టీని 28 శాతానికి తగ్గించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి, రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం ముడి పొగాకు (HSN 2401)కు సంబంధించిన అంశమని, తయారైన పొగాకు ఉత్పత్తులకు దీనికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. జీఎస్టీ పెంపు కారణంగా రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న FCV పొగాకు విలువపై తీవ్ర ప్రభావం పడుతున్న నేపథ్యంలో, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జీఎస్టీని 40 శాతం నుంచి 28 శాతానికి తగ్గించాలని కోరారు. ఈ నిర్ణయం ద్వారా పొగాకు రైతులు, డీలర్లు, ఎగుమతిదారులకు ఉపశమనం లభించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో భారత పొగాకు ఎగుమతుల పోటీతత్వం మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, త్వరితగతిన తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు, ఎంపీలు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఈ కీలక సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస రాజు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురంధేశ్వరి, లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, బస్తీపాటి నాగరాజు, బీద మస్తానీ రావు, తదితరులు పాల్గొన్నారు.

## మంగళగిరిలో నారా లోకేశ 7.30 గంటల నాన్ స్టాప్ 'పట్టా'భిషేకం

● మంగళగిరిలో 1331 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ ● 'మన ఇల్లు -- మన లోకేశ్' కార్యక్రమానికి శ్రీకారం ● సుమారు 7.30 గంటల పాటు నిలబడే పట్టాలు అందించిన మంత్రి లోకేశ్ ● లబ్ధిదారులకు పట్టాతో పాటు నూతన వస్త్రాలు బహూకరణ

**మంగళగిరి,కలంకౌంటర్ :** మంగళగిరి నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన 'మన ఇల్లు -- మన లోకేశ్' కార్యక్రమం మంగళగిరిలో ఓ పండుగలా జరిగింది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా తొలిరోజు 1331 మంది లబ్ధిదారులకు శాశ్వత ఇళ్ల పట్టాలను అందజేశారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైన పట్టాల పంపిణీ సాయంత్రం 5 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగింది. లబ్ధిదారుల 'పట్టా'భిషేకం అనదగ్గ ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ దాదాపు ఏడున్నర గంటల పాటు నిలబడే ఉండడం విశేషం. ప్రతి లబ్ధిదారుడికి ఆయనే స్వయంగా పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. పట్టా పత్రాలతో పాటు లబ్ధిదారులందరికీ నూతన వస్త్రాలను కూడా మంత్రి లోకేశ్ బహూకరించారు. సుదీర్ఘ సమయం పాటు ఒకేచోట నిలబడి



ఓపికగా పట్టాలు పంపిణీ చేయడంపై కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు, ప్రజలు ప్రశంసలు తెలిపారు.



## నేరం ఆధునికమైతే... పోలీసింగ్ అంతకంటే ఆధునికం కావాలి

-హోంమంత్రి వంగలపూడి అనిత దిశా నిర్దేశం


- 2లో




## జిఓ నెం 396 ను రద్దు చెయ్యాలని వినతి



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండార్లు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ని మంగళవారం కలిశారు. రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖను ప్రైవేటీకరణ చెయ్యాలన్న ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని, జీవో నెంబర్ 396 ను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ.... తమ పోరాటానికి మద్దతు తెలపాలని నాగేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో కోకా రంగారావు, వరికూటి శివరాం, బక్కమంతల నరసింహం, పూరిమిట్ల రవి తదితరులు ఎమ్మెల్యే ని కలిశారు.

## విజయవంతంగా రెండో రోజు పెన్డౌన్ ఆందోళన కార్యక్రమం



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ దస్తావేజులేకర్ల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా డాక్యుమెంట్ రైటర్ లు చేపట్టిన పెన్డౌన్ కార్యక్రమం రెండో రోజు మంగళవారం బంటుమిల్లి సబ్ రిజిస్టర్ ఆఫీస్ పరిధిలోని లేఖరులు మంగళవారం పెన్డౌన్ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న డాక్యుమెంట్ రైటర్స్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో 396 ను రద్దు చేయాలని డాక్యుమెంట్ రైటర్ల లైసెన్సులను పునరుద్ధరించాలని, రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## అమ్మవారి కొలుపుల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



**కందుకూరు, కలంకౌంటర్ :** కొండపి నియోజకవర్గం నందనవనం గ్రామంలో పారా వారి శ్రీ అంకమ్మ తల్లి కొలుపుల్లో మంగళవారం ప్రభుత్వ విప్, తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వహ కులు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ను ఘనంగా సన్మానించారు. అంతకుముందు నందనం గ్రామంలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం కందుకూరు మున్సిపాలిటీ పరి ధిలో దివివారిపాలెం గ్రామంలో మధ్యాహ్నం... నల్లూరి, నర్రా, కోడెల వారి దేవరకొలుపులు కార్యక్రమంలో కందుకూరు శాసనస భ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తో కలసి , ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొని దేవరకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ కం చర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు కూటమి ప్రభుత్వంపై కందుకూరు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఏపీఈడబ్ల్యుఐడి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, వార్డు టీడీపీ అధ్యక్షుడు చుండూరి మాల్యాద్రి, ప్రతిభ విద్యాసంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజ్ కరస్పాండెంట్ డాక్టర్ కంచర్ల విజయ్ శ్రీనివాస్, గ్రామ నాయకులు నల్లూరి యలమంద, రమేష్, సుబ్బారావు, మాధవరావు, పాతూరి మాలకొండయ్య, చుండూరి మాల్యాద్రి, కామణి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## వినడం...సమస్యను పరిష్కరించడం



**కందుకూరు,కలంకౌంటర్ :** ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తన కార్యాలయంలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమం... అర్జీదారులతో కిటకిటలాడుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రజలు అర్జీలరూపంలో తమ సమస్యలను ఎమ్మెల్యే కి విన్నవించుకుంటున్నారు. రెవిన్యూ సమస్యలు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు, గ్రామాలలో మౌలిక వసతులు, ఇంకా పలు సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యే ని కలుస్తున్నారు. గ్రామాల్లో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ... అధికారులకు వెంటనే ఫోన్ చేసి అభివృద్ధిపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశిస్తున్నారు. అలాగే రికార్డుల పరంగా ఎదురవుతున్న సమస్యల పరిష్కారంపైనా యంత్రాంగానికి సూచనలు చేస్తున్నారు. సంక్షేమ పథకాల అమలులో అడ్డంకిగా మారుతున్న టెక్నికల్ కష్టాలు కూడా వెంటనే తీరుతున్నాయి. ముందు తాము చెప్పిన సమస్యను సావధానంగా వినడం, పూర్తి వివరాలు తెలుసుకోవడం, తద్వారా సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే నాగేశ్వరరావు చొరవ తీసుకుంటున్న విధానం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు నిర్లక్ష్యం వహించే అధికారులను హెచ్చరిస్తూ... మరోవైపు సామాన్య ప్రజల ఇబ్బందులు తొలిగేలా యంత్రాంగాన్ని నడిపిస్తున్న తీరుపట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# నేరం ఆధునికమైతే... పోలీసింగ్ అంతకంటే ఆధునికం కావాలి

### -హోంమంత్రి వంగలపూడి అనిత దిశా నిర్దేశం








**విజయవాడ,కలంకౌంటర్ :** నేరాల స్వరూపం రోజురోజుకు సాంకేతికత ఆధారంగా మారుతున్న నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ పోలీసింగ్ కూడా అంతకంటే ఆధునికంగా, వేగవంతంగా, ప్రజాకేంద్రీకృతంగా రూపాంతరం చెందాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలోని డా. బిఆర్ అంబేద్కర్ కళా వేదిక లో నిర్వహించిన రిట్రీట్‌లో హోం మంత్రి అనిత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు . రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ఉన్నత పోలీసు అధికారులను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ... 2001లో అప్పటి ముఖ్యమంత్రి, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన పోలీసు సంస్కరణల రిట్రీట్ సంప్రదాయాన్ని 25 సంవత్సరాల అనంతరం అదే దూర దృష్టి, అదే సంస్కరణల స్ఫూర్తితో పునరుద్ధరించడం చారిత్రాత్మకమని హోంమంత్రి పేర్కొన్నారు. భవిష్యత్ సవాళ్లను ముందుగానే అంచనా వేసి పోలీసు వ్యవస్థను సిద్ధం చేయడమే ఈ రిట్రీట్ ప్రధాన లక్ష్యమని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజల తరపున ఈ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు, డీజీపీ కార్యాలయం, జిల్లా ఎస్పీలు, పోలీసు సిబ్బందిని ఆమె అభినందించారు. క్షేత్రస్థాయిలో పోలీసులు చేస్తున్న సేవలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలు, వామపక్ష తీవ్రవాదం, మతకలహాలను గణనీయంగా అదుపులోకి తీసుకురాగలిగామని పేర్కొన్న హోంమంత్రి, ప్రస్తుతం సైబర్ నేరాలు, రౌడీయిజం, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఆధునిక నేరాలను ఎదుర్కోవడానికి పోలీసులు కూడా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం పెరుగుతోందని, ప్రజలను తప్పుదారి పట్టించే ప్రచారాన్ని వాస్తవాలు, ఆధారాలతో తిప్పికొట్టే బాధ్యత పోలీసులదేనని అన్నారు. ప్రతి ఘటనపై ప్రజలకు పారదర్శకంగా సమాచారం అందించడం ద్వారా పోలీసు వ్యవస్థపై విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని పేర్కొన్న మంత్రి, మహిళలపై నమోదవుతున్న నేరాలను సుమారు నాలుగు శాతం తగ్గించగలిగామని తెలిపారు. గంజాయి నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఈగల్ ' వ్యవస్థ ద్వారా ఎస్పీలు, పోలీసు అధికారులు సమన్వయంతో గంజాయి సాగు, అక్రమ రవాణాపై సమర్థవంతమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. 112 అత్యవసర స్పందన వ్యవస్థ ద్వారా స్పందన సమయాన్ని గణనీయంగా తగ్గించామని, పోలీసింగ్‌లో 'గోల్డెన్ టైమ్' అత్యంత కీలకమని హోంమంత్రి పేర్కొన్నారు. వేగవంతమైన స్పందన వల్ల నేరస్థులను త్వరగా అదుపులోకి తీసుకురావడంతో పాటు బాధితుల్లో భరోసా పెరుగుతుందని అన్నారు. పోలీసు శాఖ బలోపేతానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, ఇప్పటికే 6,000 మంది కానిస్టేబుళ్ల పోస్టులను భర్తీ చేశామని, భవిష్యత్తులో కూడా ప్రతి జాబ్ క్యాలెండర్‌లో కొత్త పోలీసు పోస్టులను భర్తీ చేస్తూ శాఖను మరింత బలోపేతం చేస్తామని హోంమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను మరింత పటిష్ఠం చేయడానికి, నూతన తరహా నేరాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ రెండు రోజుల రిట్రీట్‌లో మహిళలు, చిన్నారులపై నేరాల నియంత్రణ, సైబర్ భద్రత, రౌడీయిజం నిర్మూలన, ఫ్యాక్షన్ రాజకీయాల నియంత్రణ, వామపక్ష తీవ్రవాద నిర్మూలన, మతసామరస్య పరిరక్షణ వంటి ఆరు కీలక అంశాలపై వర్కింగ్ గ్రూపులు చర్చలు జరుపుతున్నాయని తెలిపారు. క్షేత్రస్థాయి అనుభవాల ఆధారంగా రూపొందే సూచనలు రాష్ట్ర పోలీసింగ్‌కు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికగా మారనున్నాయని చెప్పారు. రిట్రీట్ ముగింపు సమావేశానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారని, అధికారులు తమ వినూత్న ఆలోచనలు, సంస్కరణల ప్రతిపాదనలు, కార్యాచరణ ప్రణాళికలను సమగ్రంగా సమర్పించాలని హోంమంత్రి కోరారు. "నేరం ఎంత ఆధునికమైనా... ఆంధ్రప్రదేశ్ పోలీసింగ్ దానికంటే ఒక అడుగు ముందే ఉంటుంది. సాంకేతికత, వేగవంతమైన స్పందన, పారదర్శకత, ప్రజల విశ్వాసం ఆధారంగా ఫ్యూచర్-రెడీ ఏపీ పోలీస్ వ్యవస్థను నిర్మించి దేశానికే ఆదర్శంగా నిలబెడతాం" అని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ ... ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా, రాబోయే 20 సంవత్సరాల సవాళ్లను ఎదుర్కొనే అత్యాధునిక పోలీసింగ్ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమన్నారు. మారుతున్న నేరాల స్వరూపాన్ని దృష్టిలో పెట్టుకుని 10 కీలక అంశాలతో కూడిన భవిష్యత్ కార్యాచరణను రూపొందించినట్లు వెల్లడించారు. సాంప్రదాయ పోలీసింగ్‌కు బదులుగా డిజిటల్, టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. నమోదైన కేసుల సంఖ్య కంటే, ముందుగానే నివారించిన నేరాలు, ప్రమాదాల ఆధారంగా పోలీస్ పనితీరును అంచనా వేసే విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. విదేశాల నుంచి జరిగే సైబర్ మోసాలు, డీప్‌ఫేక్‌లు, అనామక సైబర్ బెదిరింపులను ఎదుర్కొనేందుకు ముందస్తు నిఘా వ్యవస్థలను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. డ్రోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో డ్రోన్ నిఘా, నిర్వహణ కోసం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భౌతిక అర్హతలతో పాటు కోడింగ్, క్రిప్టోగ్రఫీ, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో నైపుణ్యం కలిగిన యువతను పోలీస్ బలగాల్లోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. అత్యవసర సేవల 112 కాల్ వచ్చిన వెంటనే క్షణాల్లో స్పందించే వ్యవస్థను అభివృద్ధి చేయడం, పోలీస్--వైద్య--మహిళా సంక్షేమ శాఖల సమన్వయంతో గృహహింస, ఆత్మహత్యలు, బాలలపై నేరాల నివారణకు డిజిటల్ హెల్త్ అండ్ సేఫ్టీ గ్రిడ్, ప్రిడిక్టివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) వ్యవస్థలను వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ లక్ష్యాల సాధన కోసం 0--3 సంవత్సరాలు (స్వల్పకాలిక), 3--7 సంవత్సరాలు (మధ్యకాలిక), 7--20 సంవత్సరాలు (దీర్ఘకాలిక) దశలవారీ కార్యాచరణ ప్రణాళికతో ఏపీ పోలీస్ శాఖ ముందుకు సాగుతుందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు.

# కావలి రెడ్ క్రాస్ కు విరాళాలు

- ఒక లక్ష ఎనబై వేల రూపాయలు అందజేసిన వాసవి వాకర్స్ అసోసియేషన్
- ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేసిన అమర సుబ్బారావు





**కావలి, కలంకౌంటర్ :** కావలి రెడ్ క్రాస్ నిర్మిస్తున్న కాన్సర్ నిర్ధారణ కేంద్రం నిర్మాణం కొరకు వాసవి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఒక లక్ష ఎనబై వేల రూపాయలు విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని కావలి రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ బెజవాడ రవికుమార్ కు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నిర్వాహకులు జి. వెంకటేశ్వర్లు, సోమిశెట్టి శ్రీనివాసులు, శ్రీరామమూర్తి, సిహెచ్ నాగేశ్వరావులు మాట్లాడుతూ, తమ సభ్యులు 17 మంది 10 వేల రూపాయలు చొప్పున, ఇద్దరు 5 వేల రూపాయల చొప్పున మొత్తం 1 లక్ష 80 వేల రూపాయలు కాన్సర్ నిర్ధారణ కేంద్రం నిర్మాణం కొరకు వినియోగించాలని కోరారు. అమరా సుబ్బారావు ( అమర గోల్డ్ ) 70 వేల రూపాయలు విలువ చేసే ఆక్సిజెన్ కాన్సంట్రేటర్ ను రెడ్ క్రాస్ ఆక్సిజన్ బ్యాంకు కు అందజేశారు. సాయిషా దంత వైద్యాశాల నిర్వాహకురాలు మంజూష -రాకేష్ దంపతులు తమ కుమార్తె సాయిషా 6వ జన్మదినాన్ని రెడ్ క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్ లో రక్తమార్పిడి చేయించుకుంటున్న చిన్నారుల మధ్య జరుపుకోవడంతో పాటు, తలసేమియా కేంద్ర నిర్వాహణకు పది వేల రూపాయలు విరాళం అందజేశారు. దాతలకు కావలి రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, చైర్మన్ డి రవిప్రకాష్, వైస్ చైర్మన్ కె హరినారప రెడ్డి, కోశాధికారి అరికట్ల మధుసూదనరావు, పాలకమండలి సభ్యులు మరియు తలసేమియా డే కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ పామూరు శ్రీధర్ ధన్యవాదములు తెలిపారు.

# ఉత్తమ విద్యార్థులకు సన్మానం...





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విద్యార్థుల షైనీ అవార్డులను మచిలీపట్నం లేడీ యాంప్తుల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన నాలుగు ఇంటర్ విద్యార్థులకు లభించింది. నలుగురు విద్యార్థులు వెయ్యకు 969 మార్కులు పైగా ఇంటర్మీడియట్ లో సాధించారు. కృష్ణ ఎన్టీఆర్ జిల్లాల్లోని 18 ప్రభుత్వ కళాశాలలో లేడీ యాంప్తుల్ కళాశాలకే నాలుగు అవార్డులు, బంటుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఒక అవార్డు రావడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ పి. లక్ష్మి తెలియజేశారు. మంగళ వారం కళాశాలలో జరిగిన అభినందన సభకు న్యాయవాది కళాశాల మేనేజ్మెంట్ కమిటీ మాజీ సభ్యులు లంకిశెట్టి బాలాజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగాలంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయ సాధన మేరకు మచిలీపట్నం లేడీ యాంప్తుల్ కళాశాలలో విద్యా ప్రమాణాలు ఉన్నతంగా ఎదిగాయని అన్నారు. ప్రిన్సిపాల్ అధ్యాపకుల సమిష్టి కృషితో రాష్ట్ర స్థాయిలోనూ జిల్లా స్థాయిలోనూ అవార్డులు సంపాదించి నేడు నాలుగు షైనీ అవార్డులు సంపాదించడం విద్యార్థులు ముందు అడుగుకు తార్కాణమని అన్నారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ రాబోయే స్వాతంత్ర దినోత్సవం రోజున తల్లి తండ్రి లేని విద్యార్థులకు పదివేల రూపాయలు యూనిఫారంలను లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ ద్వారా అందించడం జరుగుతుందని తెలియజేశారు. విద్యార్థినిలు బాగా చదువుకుని ఎదగాలని ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం సొమ్మును కేవలం విద్యకే కేటాయించాలని బాలాజీ సూచించారు. 15 అవార్డు మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులకు నూతన దుస్తులను అందజేశారు. కళాశాలకు చెందిన అధ్యాపకులు జయ ప్రకాష్ సిఎస్సి లో వెయ్యకు 982 మార్కులు సాధించిన పి. ఆకాంక్షకు ఐదు వేల రూపాయలు నగదు బహుమతి అందజేశారు. షైనీ అవార్డులు పొందిన కే.ఆకాంక్ష, ఏ ఫాతిమా, అచ్యుత సుధారాణి,, పెండ్ర నవ్య ను అధ్యాపకులు ప్రిన్సిపాల్ తల్లిదండ్రులు అభినందించారు..

## అధునాతన డ్రోన్ పోలీస్ స్టేషన్ కు అందజేత




**కందుకూరు,కలంకౌంటర్ :** ఇండోసాల్ కంపెనీ రూ. 1,80,000/- విలువైన డ్రోన్ ను కందుకూరు డిఎస్పి సిహెచ్ వి బాలసుబ్రమణ్యం చేతుల మీదుగా మంగళవారం ఉలవపాడు పోలీస్ స్టేషన్ కు సబ్ ఇన్స్పెక్టర్ ఇండోసోల్ ప్రతినిధులు డీజీమ్ రంగా రెడ్డి, పిఆర్ఓ లక్ష్మీనాథ్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ అన్వర్ భాషా, సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి కింజరపు ను కలిసిన ఎంపీ బీద మస్తాన్ రావు, ఏపీ పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి



**కావలి,కలంకౌంటర్ :** న్యూఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడుని రాజ్ భవన్‌లో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తోకలిసిమర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డెన్మార్క్‌లో శిశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో ఉన్న భారతీయ చిన్నారిని వీలైనంతత్వరగా స్వదేశానికి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం సమర్పించారు.

## షూటింగ్‌లో గాయపడిన బాలకృష్ణకు నారా లోకేశ్ ఫోన్..

**అమరావతి,కలంకౌంటర్ :** నందమూరి బాలకృష్ణకు తన 111వ సినిమా షూటింగ్‌లో స్వల్ప గాయమైంది. ఈ విషయం తెలుసుకున్న ఆయన అల్లుడు, ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. "బాలా మావయ్య త్వరగా కోలుకోవాలి" అంటూ ఆకాంక్షించారు. ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా #NBK111 చిత్రం తెరకెక్కుతోంది. కాకినాడలో జరుగుతున్న షూటింగ్‌లో భాగంగా బాలకృష్ణ, మంచు మనోజ్‌పై ఓ కీలక యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ క్రమంలో బాలకృష్ణ మోకాలికి స్వల్ప గాయమైంది. కండరం చిరగడంతో (మజిల్ టియర్) ఆయన్ను వెంటనే ఆసుపత్రికి తరలించారు. బాలకృష్ణను పరీక్షించిన వైద్యులు, ఓ చిన్న శస్త్రచికిత్స అవసరమని సూచించినట్లు సమాచారం. అయితే, అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదని, ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని చిత్ర బృందం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ప్రమాదం ఎలా జరిగిందనే వివరాలను లోకేశ్ అడిగి తెలుసుకుని, బాలకృష్ణ త్వరగా కోలుకుని షూటింగ్‌లో పాల్గొనాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వైభవంగా వారాహి నవరాత్రోత్సవాలు

● శ్రీ సర్ప సూక్త హోమం ● కుంకుమార్చనలో పాల్గొన్న మంత్రి రవీంద్ర ● వారాహిమాతను దర్శించుకున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ ● శ్రీ సువర్చలా సమేత ఆంజనేయ స్వామి కళ్యాణం







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక అజాద్ రోడ్ లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీ వారాహి నవరాత్ర మహోత్సవా లలో భాగంగా ఏడవ రోజు మంగళవారం ఉదయం శ్రీ సర్వసూక్త హోమం నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన లో పాల్గొన్న మంత్రి రవీంద్ర : ఆషాడ మాసం సందర్భంగా వారాహి అమ్మవారికి నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మహిళా మాతలతో కలిసి పాల్గొన్నారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు టిడిపి నాయకులు కొనకళ్ళ జగన్నాథరావు ( బుల్లయ్య) అమ్మవారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు బుల్లయ్య మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు, తీర్థ ప్రసాద వినియోగం జరిగాయి.

**వైభవంగా ఆంజనేయ స్వామి కళ్యాణం :** సాయంత్రం శ్రీ సువర్చలా సమేత ఆంజనేయ స్వామి వారి కళ్యాణం జరిగింది. రాత్రి నీరాజన మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. పొక్కునూరి హరనాథ శర్మ అవధాని బ్రహ్మత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ పాలకవర్గ సభ్యులు మామిడి మురళీకృష్ణ, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్,సామా వెంకటలక్ష్మీ కాంతారావు, బైసాని హయగ్రీవ రావు, ఉడత్తు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.





## బిల్డింగ్ కమిటీ చైర్మన్ కు చిరు సత్కారం





**విజయవాడ,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ నూతన భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తున్న సందర్భంగా బిల్డింగ్ కమిటీ చైర్మన్ పెనుగొండ సుబ్బారాయుడు కు చిరు సత్కారం చేసిన మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య,ప్రధాన కార్యదర్శి మాటూరి రంగనాథ్.

## కూటమి ప్రభుత్వం వచ్చాక దాడులు

### –పేరకం నాగాంజనేయులు

### వైసీపీ వాణిజ్య విభాగం సభ్యుడు

**ఒంగోలు,కలంకౌంటర్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్యవైశ్యులపై దాడులు పెరిగాయని ,తనపై వేధింపులు జరిగాయని వైసీపీ వాణిజ్య విభాగం సభ్యుడు పేరకం నాగాంజనేయులు అన్నారు. ఒంగోలు సూపర్ బజార్ చైర్మన్ పల్లపోతు వెంకటేశ్వర్లు తెలుగుదేశం పార్టీకి సూపర్ బజార్ చైర్మన్ పదవికి వెంటనే రాజీనామా చేయాలని పొట్టి శ్రీరాములు అభిమాన సంఘం అధ్యక్షులు, వైసీపీ వాణిజ్య విభాగం సభ్యులు పేరకం నాగాంజనేయులు డిమాండ్ చేశారు. తనని తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత తమపై మరో కొంతమందిపై దాడి చేశారని అన్నారు. తన సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్న కోదండ రామాలయాన్ని ఎమ్మెల్యే మనుషులు బెదిరించి తనను దగ్గరకు రాకుండా చేశారని ఆరోపించారు. 2014లో తాను కూడా టిడిపి గెలుపుకు కృషి చేశానని తన రేషన్ షాపును తొలగించినందువలనే తాను టిడిపికి రాజీనామా చేసి వైసీపీలో చేరానని చేరానని నాగాంజనేయులు తెలిపారు. ఒంగోలులో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటుకు, అమరజీవి పొట్టి శ్రీరాములు పుట్టిన స్థలాన్ని కొనుగోలు చేసినందుకు పల్లపోతు వెంకటేశ్వర్లు సహకరించారని , అటువంటి మంచి వ్యక్తి తెలుగుదేశం పార్టీలో ఉండకూడదని వెంటనే రాజీనామా చేయమని నాగాంజనేయులు కోరారు. కూటమి ప్రభుత్వం లో ఆర్యవైశ్యులకు రక్షణ కరువైందని ఆవేధన వ్యక్తం చేశారు.

## వైసీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టు తీవ్రంగా నష్టపోయిందన్న నిమ్మల

**విజయవాడ, కలంకౌంటర్ :** 2019లో తెలుగుదేశం ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేదని... కానీ గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల విధ్వంస పాలన వల్ల ప్రాజెక్టు తీవ్రంగా నష్టపోయిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు గాడిన పడుతున్నాయని పేర్కొన్నారు. సచివాలయంలో జలవనరుల శాఖపై ఈరోజు ఆయన శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కీలకమైన ప్రాజెక్టులు, వాటి తాజా స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు వెల్లడించారు. 2014-19 మధ్యకాలంలో పోలవరం పనులు వేగంగా జరిగి 72 శాతం మేర పూర్తయ్యాయని, అయితే జగన్ 'ఒక్క ఛాన్స్' అంటూ వచ్చి రివర్స్ టెండరింగ్ పేరుతో తీవ్ర నష్టం చేశారని విమర్శించారు. కాంట్రాక్టు ఏజెన్సీలను రద్దు చేయవద్దని ఎంతమంది హెచ్చరించినా వినకుండా, 17 నెలల పాటు పనులను నిలిపివేశారని మండిపడ్డారు. ం

# ప్రమాణ స్వీకార మహోత్సవం








**విజయవాడ, కలంకౌంటర్ :** విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకార మహోత్సవం లో ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య నూతన కార్యవర్గం తో ప్రమాణ స్వీకారం చేయించారు., ఈ కార్యక్రమం లో అతిథులుగా ఎం ఎల్ ఎ బొండా ఉమా,ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మహాసభ బిల్డింగ్ కమిటీ చైర్మన్ పెనుగొండ సుబ్బారాయుడు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కొప్పురావురి రజిని, సేవాదళ్ విభాగం అధ్యక్షుడు ధూపకుంట్ల శబరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





## ఆర్టీసీ బస్సు వేళలు ప్రదర్శించండి

### -కృష్ణా జిల్లా. బి సి సంక్షేమ సంఘం

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం నుంచి గూడూరు, మొవ్వ, గుడ్లవల్లేరు మండల గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులకు సంబంధించిన సమయాలను స్థానిక చలరాస్తా లో ప్రచురించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు కు కృష్ణాజిల్లా బి.సి సంక్షేమ సంఘ నాయకులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆ సంఘ అధ్యక్షులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్థానిక చలరాస్తా లో గూడూరు, మొవ్వ, గుడ్లవల్లేరు మండలాలకు సంబంధించి దాదాపు తొమ్మిది గ్రామాలకు మచిలీపట్నం ఆర్టీసీ డిపో నుంచి బస్సులు నడపడం జరుగుతొందన్నారు. అయితే ఏ బస్సు ఏ సమయానికి వెళుతుందో తెలియక ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని కాబట్టి బస్సుల సమయాలను తెలిపే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వృద్ధ ప్రయాణికులు విజయవాడ వెళ్లే నాన్ స్టాప్, పల్లె వెలుగు బస్సులను చలరాస్తా లో ఆపకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వృద్ధులు స్థానిక మూడు స్తంభాల సెంటర్ వద్ద ఉన్న బస్టాప్ కి వెళ్లడానికి ఇబ్బంది పడుతుండడంతో, తప్పనిసరిగా విజయవాడ వైపు వెళ్లే బస్సులను చలరాస్తా లో ఆపాలని డిపో మేనేజర్ పెద్దిరాజుకు వినతి పత్రం సమర్పించడం



జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో జోగి శివ, నిక్కు రాధా కృష్ణా,బోగిరెడ్డి సుభాని, నరిశెట్టి రత్తయ్య,గౌర శ్రీను,సి. హెచ్. ఫణీ కుమార్,సి. హెచ్.కోటేశ్వరరావు,బి. ప్రసాద్, బి. నాగరాజు, తదితర బి. సి. నాయకులు పాల్గొన్నారు.

## దస్తావేజు లేఖర్లకు వైసీపీ సంఘీభావం

### -రెండో రోజు పెన్ డౌన్ విజయవంతం

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** దస్తావేజు లేఖర్ల వ్యవస్థను కొనసాగించాలని, రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 396 జీవోను తక్షణం ఉపసంహరించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) జిల్లా కేంద్రం మచిలీపట్నం రిజిస్టార్‌వారి కార్యాలయం ఎదుట మచిలీపట్నం దస్తావేజు లేఖరులు నిర్వహిస్తున్న పెన్‌డౌన్ కార్యక్రమం రెండో నిరసన శిబిరాన్ని మంగళవారం భారీ ర్యాలీతో సందర్శించి తమ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టూ మాట్లాడుతూ దస్తావేజులు రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న దస్తావేజు లేఖరులను విస్మరిస్తూ ప్రయివేటు వ్యక్తులకు కాంట్రాక్టు పద్ధతిలో సేవాకేంద్రాలను ఏర్పాటు చేసే చర్యలను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు పేర్కొన్నారు. వైసీపీ నాయకులు షేక్ సిలార్‌దాదా, అచ్చాబా, లంకా సూరిబాబు, బొర్రా విఠల్, మహమ్మద్ రఫీ తదితర నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంకా కమ్యూనిస్టు నాయకులు కొడాలి శర్మ, బిఎస్‌పి నాయకులు బాలాజీ తదితరులు మాట్లాడుతూ జీవో 396 ను తక్షణం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. రెండో రోజు విజయవంతంగా జరిగిన ఈ పెన్‌డౌన్ కార్యక్రమంలో సంఘం



అధ్యక్షులు వాడపల్లి బాలాజీ సువర్ణకుమార్, ప్రధాన కార్యదర్శి సర్దార్ రహీం, ఉపాధ్యక్షులు నరహరిశెట్టి తుకారాం, వెంట్రప్రగడ వేణుగోపాల రావు, సీనియర్ లేఖర్లు దొంతు వెంకటేశ్వర్లు, నున్నా ఇందుప్రసాద్, మల్లాప్రగడ యుగసారధి, పువ్వుల రమేష్, బోయిన దుర్గాప్రసాద్, ఆత్మూరి రాము, నూలు రాంబాబు, సత్యనారాయణ, మండా జయచంద్రకుమార్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com